క్లుప్తంగా

నీటి సంఘాల ఎన్నికకు నోటిఫికేషన్



ప్రత్తిపాడు: మండల పరిధిలోని యనమదలలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నోటిఫికేషన్‌ను బుధవారం ఏఓ కె.అరుణకుమారి విడుదల చేశారు. అందుకు సంబంధించిన 3, 13 ఫారంలను స్థానిక గ్రామ సచివాలయం వద్ద పబ్లిష్ చేసి ప్రజలకు అందుబాటులో నోటీసు బోర్డులో ఉంచారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి అరుణ కుమారి మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఉన్న ఆదేశాల ప్రకారం ఈ నెల 14వ తేదీన యనమదలలో నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అదే రోజు ఉదయం ఎనిమిది గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై సాయంత్రం ఐదు గంటలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలతో ముగుస్తుందని అరుణకుమారి చెప్పారు.

తేమ శాతం తక్కువగా ఉండే విధంగా చూసుకోవాలి



గరికపాడు(కాకుమాను): ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసిన రైతులు ధాన్యాన్ని తేమ శాతం తక్కువగా ఉండే విధంగా ఆరబెట్టుకోవాలని ఏఓ కె.కిరణ్మయి అన్నారు. మండలంలోని గరికపాడు, తెలగాయపాలెం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ తేమ శాతం 17లోపు ఉండే విధంగా రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని కనీస మద్దతు ధర పొందాలని సూచించారు. గ్రామాలలోని ప్రతి రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. సాధారణ రకం క్వింటాకు రూ.2,300, గ్రేడ్ ఏ రకానికి రూ.2,320 ప్రభుత్వం చెల్లిస్తుందని వివరించారు.

దర్గాను సందర్శించిన మైనార్టీ కమిషన్ సభ్యురాలు



పెదకాకాని: బాజీబాబా దర్గాను జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ సాహెజాది బుధవారం దర్శించుకున్నారు. ఆమకు దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా దర్గా మర్యాదలతో పకీర్ల పాటలు, బ్యాండ్ మేళాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం దర్గా ఈఓ షేక్ ముక్తార్‌బాషా దర్గాలో జరిగే ప్రార్థనలు, దినచర్యలపై జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలికి వివరించారు. ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కమిషన్ విశ్రాంత ప్రత్యేక అధికారి షరిన్‌బేగం, జిల్లా వక్ఫ్‌బోర్డు మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ మహబూబ్ షరీఫ్ పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



ఏఎన్‌యూ: యూనివర్సిటీ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు సూచించారు. ఏపీ పీజీ సెట్ ద్వారా ఆచార్య నాగార్జున యూనివర్సిలో ఆయా విభాగాల్లో ప్రవేశాలు పొందిన మొదటి ర్యాంకు విద్యార్థులకు యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈసభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీలో తాను కష్టపడి చదివానని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకున్నానని వివరించారు. గ్రామీణ ప్రాంతాలలో, పేద కుటుంబంలో పుట్టి ఎమ్మెల్సీగా ఎదగడానికి ఆంధ్రా యూనివర్సిటీ వేదికగా మారిందని తెలిపారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఎంతో ఉందని చెప్పారు. రిజిస్ట్రార్ సింహాచలం మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని విద్యార్థులు చదువుకోవాలని, ప్రపంచానికి తెలియని విషయాలన్నీ టెక్నాలజీ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. కామర్స్ విభాగాధిపతి శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ తల్లిదండ్రులు నమ్మకాన్ని విద్యార్థులు నిలబెట్టుకోవాలని, కష్టపడి చదివి మంచి ఫలితాలను సాధించాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలను అలవాటు చేసుకోవాలి ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగిన స్పందించు అనే చేగువేరా నినాదాన్ని మనందరం గుర్తు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణ ఒకరికి.. శిక్షమరొకరికి

- ఎల్ఎస్‌జీడీ శిక్షణకు ఏఎన్ఎంలు
- వ్యాక్సిన్ కోసం సబ్‌సెంటర్లుకు గర్భిణులు, పసికందులతో బాలింతలు
- గంటల తరబడి కేంద్రాల్లో తల్లుల పడిగాపులు



నడింపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వ్యాక్సినేషన్ కోసం చంటిబిడ్డలనెత్తుకుని వేచి చూస్తున్న బాలింతలు, గర్భిణులు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారిని ఎత్తుకుని వేచి ఉన్న బాలింత

ప్రత్తిపాడు: ఏఎన్ఎంల శిక్షణ, గర్భిణులు, బాలింతలు, పసికందులకు 'శిక్ష'గా మారింది. ఏఎన్ఎం వస్తారు.. వ్యాక్సిన్ వేస్తారు.. అని ఉదయం నుంచి సాయంత్రం వరకు గంటల తరబడి నిరీక్షించి నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది.

వివరాలు.. నేషనల్ ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా సబ్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గర్భిణులకు టెటానస్, డిఫ్తీరియా వ్యాక్సిన్‌లు వేస్తారు. అదేవిధంగా పసికందులు, చిన్నారులకు పోలియో వ్యాధి రాకుండా 6,10,14 వారాల్లో ఓపీవి వ్యాక్సిన్, తట్టు వ్యాధి రాకుండా 9–12 నెలల మధ్య మీసెల్స్, పోలియో వ్యాధి రాకుండా 6,14 వారాల్లో ఐపీవి, పచ్చ కామెర్లు రాకుండా హెపటైటిస్–బి, కంఠ సర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం పచ్చకామెర్లు, ఇన్‌ఫ్లుంజా వంటివి రాకుండా 6, 10, 14 వారాల్లో పెంటావాలెంట్, రే చీకటి రాకుండా విటమిన్–ఏ, క్షయ వ్యాధి రాకుండా పుట్టిన వెంటనే బీసీజీ వ్యాక్సిన్లు వేస్తారు. ఇప్పటికే ఇవి జిల్లా వ్యాప్తంగా పెంటా, బర్త్ డోస్, ఎంఆర్–1, ఎంఆర్–2 పెండింగ్‌లో ఉన్నాయి.

శిక్షణ ఉండటంతో..

ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియ అంతా ప్రతి నెలా బుధవారం జరుగుతుంది. రెండు రోజులుగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డీఏలు, విలేజ్ సర్వేయర్లు, పీఎస్‌లు, పశుసంవర్ధకశాఖ, ఎనర్జీ అసిస్టెంట్‌లతో పాటు ఏఎన్ఎంలకు కూడా ఎల్ఎస్‌జీడీపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే బుధవారం వ్యాక్సినేషన్ నేపథ్యంలో ఎంపీడీఓల వద్ద అనుమతి తీసుకుని వ్యాక్సినేషన్ ప్రక్రియను చేయాలని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు సూచించారు.

ఇరుకుగదుల్లో.. చంటిబిడ్డలతో..

దీంతో వ్యాక్సినేషన్‌కు అనుమతి ఇవ్వాలంటూ ఏఎన్ఎంలు సంబంధిత అధికారులను కోరారు. ఉదయాన్నే ఆరుగంటల నుంచి వ్యాక్సినేషన్ ప్రారంభి, ట్రెనింగ్ సెషన్ ప్రారంభమయ్యే లోపల ముగించుకుని శిక్షణకు హాజరు కావాలని, అంతేగానీ శిక్షణకు మినహాయింపు ఉండదని అధికారులు స్పష్టం చేశారు. ఉదయాన్నే తల్లులు పసికందులను తీసుకుని వ్యాక్సినేషన్‌కు వచ్చే పరిస్థితి లేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఏఎన్ఎంలు అధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలో శిక్షణకు హాజరయ్యారు. దీంతో ఆయా గ్రామాల్లో వ్యాక్సినేషన్ కోసం సబ్‌సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు పసికందులతో వచ్చిన తల్లులు నానా అగచాట్లు పడ్డారు. చిన్నచిన్న ఇరుకుగదుల్లో చంటిపిల్లలను ఒడిలో కూర్చోబెట్టుకుని గంటల తరబడి నిరీక్షించినప్పటికీ వ్యాక్సినేషన్ వేసే వారు రాకపోవడంతో నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది.

శిక్షణ ఉండటంతో వ్యాక్సిన్ ఇవ్వలేదు



మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం ఉండటం వలన వ్యాక్సినేషన్ జరగలేదు. రెండో ఏఎన్ఎం ఉన్న చోట వ్యాక్సినేషన్ చేయించాం. ఉదయం పూట వ్యాక్సినేషన్ పూర్తి చేసుకుని పదిగంటలకు శిక్షణకు హాజరు కావాలని చెప్పారు. ఉదయం పూట పిల్లలను తీసుకుని తల్లులు వ్యాక్సిన్ కోసం వచ్చే పరిస్థితి ఉండదు. అందుచేత వ్యాక్సినేషన్ చేయలేదు. ట్రెనింగ్ సెషన్ త్వరగా ముగిస్తే వ్యాక్సినేషన్ చేయిస్తాం.

– మేరియునిస్, వైద్యాధికారి, గొట్టిపాడు పీహెచ్‌సీ

సైబర్ కేటుగాళ్ల ఉచ్చులో పడకండి



మాట్లాడుతున్న ఎస్ఐ నాగేంద్ర

ప్రత్తిపాడు: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు ఎస్ఐ కె.నాగేంద్ర అన్నారు. సైబర్ క్రైం వారోత్సవాలలో భాగంగా మండల పరిధిలోని మిట్టపల్లి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెరుగుతున్న శాస్త్ర సాంకేతికను ఆసరాగా చేసుకుని సైబర్ కేటాగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. బ్యాంకులు గానీ ఇతరత్రా ప్రభుత్వరంగ సంస్థలేవీ ఫోన్లు చేసి ఓటీపీలు, వ్యక్తిగత సమాచారం అడగవు అన్న విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. అదే విధంగా యువత సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలను డీపీలుగా పెట్టడం వలన కూడా ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని, కొందరు సైబర్ నేరగాళ్లు మోసపూరిత ఆలోచనలతో ఫొటోలను మార్ఫింగ్ చేసి బెదిరింపులకు పాల్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. యువత సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల్లో అత్యంత జాగ్రత్తగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపికృష్ణ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



తిమ్మాపురంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కరుణకుమార్



పొన్నూరులో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న అర్జీదారుడు

ప్రత్తిపాడు: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని తహసీల్దార్ జి.కరుణకుమార్ అన్నారు. మండల పరిధిలోని తిమ్మాపురంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు తహసీల్దార్‌కు పలు సమస్యలను వివరించారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చే అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో డీటీ ధర్మతేజ, ఈవోలు వెంకటేశ్వర్లు, శిరీష, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

రెవెన్యూ సభలతో ప్రయోజనం శూన్యం

పొన్నూరు: తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా.. ఇలాంటి సదస్సులతో ప్రయోజనం ఏమీ ఉండటం లేదని అర్జీదారుడు మునిపల్లె గ్రామానికి చెందిన రైతు కుర్రా మల్లికార్జునరావు ఆవేదన వ్యక్తం చేశాడు. బుధవారం మండలంలోని మునిపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారులకు తన ఆవేదనను తెలియజేశాడు. పూర్వీకుల నుంచి తనకు సంక్రమించిన పొలానికి సంబంధించి 21 సెంట్ల భూమికి అడంగల్‌లో పేరు చేర్చమని ఎన్నోసార్లు తహసీల్దార్ కార్యాలయంలో అర్జీ పెట్టుకున్నా పట్టించుకోలేదని వాపోయాడు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేసి తనకు న్యాయం చేయాలని కోరారు. తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ మాట్లాడుతూ సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. డీటీ రాజా రమేష్, సర్వేయర్, ఆర్ఐ శ్రీనివాస్ ప్రజల నుంచి 70 అర్జీలను స్వీకరించారు.

కాపు కమ్యూనిటీ భవన నిర్మాణం త్వరితగతిన చేపట్టాలి



వంగవీటి మోహన రంగా విగ్రహం వద్ద ఏపీ కాపు జేఏసీ నాయకులు

గుంటూరు రూరల్: ఆంధ్ర రాష్ట్ర కాపు జేఏసీ జిల్లా ప్రెసిడెంట్ ఆకుల బాబు ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర కాపు జేఏసీ సమావేశం నిర్వహించారు. తొలుత గుజ్జనగుండ్ల సెంటర్‌లోని వంగవీటి మోహనరంగా విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బైక్ ర్యాలీతో గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కాపుల కోసం కాపు కమ్యూనిటీ భవనానికి కేటాయించిన స్థలం వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. శంకుస్థాపన చేసి శిథిలమైన శిలాఫలకాన్ని శుభ్రపరిచారు. అడవితక్కెళ్లపాడులోని నల్లపాడు పోలీస్ స్టేషన్ పక్కనే గతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో భవనం నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం అదే స్థలంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు అమ్మ శ్రీనివాస్ నాయుడు, అల్లాడి సుబ్బారావు, గుర్రాల ఉమామహేశ్వరరావు, ఎర్రం నాగిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో విజ్ఞాన్ నిరులా విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలను పొందిన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధికల్పనే లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తుందని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ రాధిక తెలిపారు. పలకలూరు రోడ్డులోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుధవారం మాట్లాడారు. ప్రఖ్యాత అమెజాన్ సంస్థలో సాఫ్ట్వేర్ డెవలప్మెంట్ ఇంటర్న్‌గా నెలకు రూ.1.1 లక్షల వేతనంతో ఒకరికి, ఐబీఎం సంస్థలో రూ.11 లక్షల వార్షిక వేతనానికి ఒకరు, విస్ వైర్ సంస్థలో రూ.6 లక్షల వార్షిక వేతనానికి ముగ్గురు, టీసీఎస్ డిజిటల్ లో రూ.7 లక్షల వార్షిక వేతనానికి నలుగురు, టీసీఎస్ నింజాలో రూ.3.5 లక్షల వార్షిక వేతనానికి 30 మంది విద్యార్థినులు ఎంపికయినట్టు తెలిపారు. ఉద్యోగావకాశాలు దక్కించుకున్న విద్యార్థినులను విజ్ఞాన్ సంస్థల అధ్యక్షులు డాక్టర్ లావు రత్తయ్య, ఉపాధ్యక్షులు లావు శ్రీకృష్ణదేవరాయలు, కళాశాల ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ ఎ.నరేష్ అభినందించారు.

గ్రామీణ వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై అవగాహన



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధికారులు

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డలో గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమాన్ని బుధవారం బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో లాంఫాం ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ అపరాలలో విత్తన శుద్ధి, సమగ్ర పురుగుల యాజమాన్యం, సమగ్రం పోషక యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ వరి కోతల సమయములో రైతులు తీసుకొవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సువర్ణలత మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం, సెల్ ఫోన్ల వినియోగం ప్రజలపై, విద్యార్థులపై ఎలా ప్రభావితం చేస్తుందో వివరించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రతి మంగళ, బుధ వారములలో రోజుకు రెండు గ్రామాలలో నిర్వహించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి శిరీష, అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి పాల్గొన్నారు.

లండన్ టు అమరావతి పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ .గంగాధరరావు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఆంగ్ల విభాగ అధ్యాపకులు ఆచార్య గుజ్జు చెన్నారెడ్డి రచించిన లండన్ టు అమరావతి నవలను బుధవారం వీసీ కె.గంగాధరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ చెన్నారెడ్డి తన రచనల ద్వారా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ కీర్తిని విశ్వవ్యాప్తం చేస్తున్నారని చెప్పారు. సాహిత్యం నేటి తరానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. పుస్తక పఠనంలో ఉన్న మక్కువ సాహిత్య రచనలో చూపినట్లయితే విలువైన సాహిత్య సంపద సృష్టించవచ్చునని చెప్పారు. ఆచార్య చెన్నారెడ్డి సాహిత్య రచనలు ఆహ్వానించ తగినవని అభినందించారు. రెక్టార్ కె.రత్న షీలామణి మాట్లాడుతూ బోధన, పరిశోధనలతో పాటు సాహిత్యంపై చెన్నారెడ్డి చూపిస్తున్న మక్కువ ప్రశంసనీయమని కొనియాడారు. రిజిస్ట్రార్ జి.సింహాచలం, ప్రిన్సిపాల్స్ సురేష్ కుమార్, వీరయ్య, జాన్సన్, ప్రమీలరాణి మాట్లాడుతూ చెన్నారెడ్డి రచనలు విలువైనవని కొనియాడారు. పుస్తక రచయిత చెన్నారెడ్డి మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో జరగని ఒక నూతన ఘట్టాన్ని కథాంశంగా తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, రూస కోఆర్డినేటర్ ఆచార్య ఎస్ .మురళీమోహన్, పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ జీవీఎస్ఆర్ ఆంజనేయులు, విదేశీ విద్యార్థుల విభాగం డైరెక్టర్ పి.పద్మావతి, హెచ్ఆర్ఎం విభాగాధిపతి డాక్టర్ బి.నాగరాజు, జర్నలిజం ఇన్‌చార్జి కోఆర్డినేటర్ డాక్టర్ జె.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య



పెదకాకాని: చెట్టుకు ఉరి వేసుకుని యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం అగతవరప్పాడు ఏరియాలోని ఇన్నర్‌రింగ్ రోడ్డు సమీపంలో చోటు చేసుకుంది. పెదకాకాని మండలంలోని అగతవరప్పాడు పరిధిలో ఇన్నర్ రింగ్ రోడ్డు పక్కనే యువకుడు మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడు ప్రకాశం జిల్లా పెదదోర్నాలకు చెందిన దండా శ్రీనివాసరెడ్డి(24)గా గుర్తించారు. ఇంకా వివాహం కాలేదు. ఇన్నర్‌రింగ్ రోడ్డు పక్కనే ఉన్న వేపచెట్టుకు మంగళవారం రాత్రి కేబుల్ వైర్లతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని, ఆ తరువాత కొద్దిసేపటికి ఆ వైర్లు తెగి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి వెంకట్రామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు. మృతుడు చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ వరకూ చదువుకుని ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. ప్రేమ విఫలం కారణంగానే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు.

లాడ్జిలో వ్యక్తి అనుమానాస్పద మృతి



పెదకాకాని: లాడ్జిలో వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన ఇన్నర్ రింగ్‌రోడ్డులోని మాధవి ప్యాలెస్‌లో చోటుచేసుకుంది. పెదకాకాని మండలంలోని అగతవరప్పాడు ఏరియాలో గత కొంతకాలంగా మాధవి ప్యాలెస్ పేరుతో లాడ్జి నిర్వహిస్తున్నారు. ఈ లాడ్జికి మంగళవారం రాత్రి వింత అక్కిరెడ్డి అనే వ్యక్తి రూమ్ తీసుకున్నాడు. బుధవారం ఉదయం ఆయన ఉన్న రూము క్లీన్ చేసేందుకు ఎంత తలుపులు కొట్టినా తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులు సమాచారం అందించారు. లాడ్జి వద్దకు చేరుకున్న పోలీసులు రూమ్ తలుపులు పగులగొట్టి చూడగా మంచంపై వింత అక్కిరెడ్డి(54) పడి ఉన్నాడు. పరిశీలించగా అప్పటికే మరణించాడు. రూములో దొరికిన ఆధారాల ప్రకారం రాత్రి అతిగా మద్యం తాగి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు గుంటూరు నగరాలు ఏరియాలోని మునుస్వామినగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వింత అక్కిరెడ్డికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె కళ్ళం భార్గవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీధి కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, యాంటీ ర్యాబీస్ వ్యాక్సినేషన్ ఏటుకూరు రోడ్‌లో ప్రత్యేకంగా స్నేహ వెల్ఫేర్ వెల్ఫేర్ సొసైటీ చేస్తుందన్నారు. నగర పరిధిలో సమర్థంగా నిర్వహించేందుకు గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు ప్రత్యేకంగా వాహనాలు, సూపర్వైజర్, డాగ్ క్యాచర్లకు విధులు కేటాయించినట్లు వివరించారు.

వీధి కుక్కలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ప్రతి రోజు ప్రజారోగ్య అధికారులు అందించే షెడ్యూల్, పీజీఆర్ఎస్, 103 సెల్ ఫిర్యాదుల మేరకు ఉదయం 6 నుంచి 8, 10 నుంచి ఒంటి గంట వరకు విధులు నిర్వహిస్తారని చెప్పారు. ఆయా వార్డులకు ఈ బృందాలు వచ్చినప్పుడు స్థానిక శానిటేషన్ కార్యదర్శి, ఇన్‌స్పెక్టర్లు తమ ప్రాంతంలో పట్టుకున్న కుక్కలు, తిరిగి వదిలిన వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని కోరారు.

కళ్లం కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



డాక్టరేట్ పొందిన వీరకుమార్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి, ఉపాధ్యాయుడికి లక్ష్య సాధనకు ఎల్లప్పుడూ తోడ్పాటునందించటం తమ కళాశాల లక్ష్యమని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న జెట్టి వీరకుమార్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. ఏ స్టడీ ఆన్ ది ఇంపాక్ట్ ఆఫ్ మొబైల్ హ్యాండ్సెట్ అట్రిబ్యూట్స్ ఆన్ కస్టమర్ సాటిస్ ఫ్యాక్షన్ టు డిరైవ్ బ్రాండ్ లాయల్టీ(స్పెషల్ స్టడీ ఆన్ చెన్నై అండ్ బెంగళూరు సిటీస్) అంశంపై డాక్టర్ కె.లలిత పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి తెలిపారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల బిజినెస్ మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఇర్షాద్, కెరీర్ గైడెన్స్ విభాగాధిపతి డాక్టర్ పీఎల్ మాధవరావు అభినందించారు.

జీవనోపాధిని అన్యాయంగా కూల్చేశారు..



కూల్చేసిన దుకాణం

పొన్నూరు: జీవనాధారమైన దుకాణాన్ని అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే అన్యాయంగా కూల్చేశారని పట్టణానికి చెందిన నవీన్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ ప్రధాన రహదారిపై ఆలయ సమీపంలో దుకాణం అద్దెకు తీసుకొని గత 5 సంవత్సరాలుగా పూజా సామగ్రి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. అయితే దుకాణంలోని కొంత భాగం ఆక్రమణలో ఉందని, తొలగించాలని అధికారులు ఇప్పటి వరకూ చెప్పలేదని పేర్కొన్నాడు. బుధవారం తన కుటుంబ సభ్యులతో ఊరికి వెళ్లిన సమయంలో హఠాత్తుగా పొక్లెయిన్‌తో దుకాణాన్ని కూల్చేశారని వాపోయాడు. సమాచారం ఇస్తే ఎలాంటి నష్టం లేకుండా తానే తొలగిస్తానని, అలా చేయకుండా దుర్మార్గంగా వ్యవహరించారని ఆరోపించాడు. తనకు జరిగిన అన్యాయంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరాడు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు మాట్లాడుతూ డ్రెయిన్లపై ఆక్రమణలు తీయాలని ఆ దుకాణ యజమానికి చాలా సార్లు సూచించామని, స్వయంగా తానే చెప్పినట్లు తెలిపారు. డ్రెయిన్లను ఆక్రమిస్తే చర్యలు తప్పవని వ్యాపారులకు సూచించారు.

ఆలయంలో వసతి గృహం ప్రారంభం

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి, వీరాంజనేయ స్వామి దేవస్థానంలో నూతనంగా ఏర్పాటు చేసిన వసతి గృహాలను ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ప్రారంభించారు. కూటమి నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కాకుమాను: గ్రామాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు భాగస్వాములు కావాలని బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారలతో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించే విధంగా కృషి చేయాలని అప్పుడే ఆ గ్రామం ఆరోగ్యకరమైన గ్రామంగా ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు ముజావర్ షేక్ గుల్జార్ బేగం పాల్గొన్నారు.